ముఖ్యమంత్రివి పచ్చి అబద్ధాలు

పది నెలల్లో మల్లన్నసాగర్ నిర్వాసితులకు పైసా ఇవ్వలేదు ● గజ్వేల్‌లో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు

గజ్వేల్, బెజ్జంకి, న్యూస్‌టుడే: మూసీ నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని భారాస నిలదీస్తే.. మల్లన్నసాగర్ నిర్వాసితులకు కేసీఆర్ ఏమీ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు హరీశ్‌రావు అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులపై ప్రేమ ఉంటే నిధులు సమకూర్చి సమస్య తీర్చాలని, దానికి ఎవరు అడ్డుపడుతున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు కోరినట్లు గజ్వేల్‌లో 3,414 ఇళ్లు నిర్మించి ఇచ్చాం. ఇంటికి రూ.7.50 లక్షల ప్యాకేజీ, పెళ్లికాని వారికి రూ.5 లక్షలతో సహా ఒక్కో కుటుంబానికి సరాసరి రూ.కోటి విలువైన ఆస్తి సమకూర్చామని తెలిపారు. మొత్తంగా రూ.2 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. అక్కడక్కడా మిగిలిన వారు, కోర్టు ద్వారా వచ్చిన వారికి 10 శాతం మిగిలిపోయి ఉండవచ్చు.. దాదాపు రూ.200 కోట్లు ఇవ్వండి.. నిర్వాసితులకు రెండింతలు ఇవ్వండి.. మేము వద్దంటున్నామా.. అని అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు తాము ఇచ్చినట్లు మూసీ పరివాహకంలో ఉన్నవారికి కూడా ఇవ్వాలని చెప్పారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్వాసితులకు 180 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేసి 1,141 ఇళ్లు కట్టిచామన్నారు. వర్గల్‌లో 1,100 ఎకరాలు సేకరిస్తే కాంగ్రెస్ నాయకులే అడ్డుపడుతున్నారన్నారు. గచ్చిబౌలిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో మూసీ నిర్వాసితులకు ఇళ్లు కట్టించాలని డిమాండు చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బల్దియా ఛైర్మన్ రాజమౌళి, నాయకులు పాల్గొన్నారు.

● కరీంనగర్ జిల్లాలో అలయ్‌బలయ్ ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తూ బెజ్జంకిక్రాసింగ్, తోటపల్లి రాజీవ్ రహదారి కూడలికి చేరిన హరీశ్‌రావుకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల అమలు బాధ్యత మాది అని చెప్పిన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు ఇప్పుడు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రజలను చైతన్యపరుస్తున్న పార్టీ శ్రేణులను ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ఎంపీ పూజలు



రఘునందన్‌రావుతో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు

దోమకొండ, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబారిపేటలోని మైసమ్మ ఆలయంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యులతో ఆయన ఆదివారం అమ్మవారిని దర్శించుకుని మొక్కుకున్నారు. ఆయనను మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు సన్మానించారు.

ఈనాడు సిద్దిపేట
సోమవారం అక్టోబరు 21, 2024

ఆరోగ్యానికి అడుగులు

'ఆర్‌బీఎస్‌కే' ద్వారా 38 రకాల పరీక్షలు ● 11 వేలకు పైగా బాలలకు వివిధ సమస్యల వెల్లడి

న్యూస్‌టుడే, సిద్దిపేట:

బాల్యం.. అపురూపం. వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కొందరు వివిధ రకాల కారణాలతో అనారోగ్యానికి గురవుతున్నారు. పేదరికం సహా కనీస అవగాహన లేక సమస్యలతో నెట్టుకొచ్చే వారు అనేకం. ఈ తరుణంలో బాలబాలికలకు వైద్య పరీక్షలను వైద్యారోగ్య శాఖ. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం తొమ్మిది ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా సేవలు అందుతున్నాయి. ఒక్కో బృందంలో వైద్యాధికారి, ఏఎన్‌ఎం, ఫార్మసిస్టు అందుబాటులో ఉంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆరోగ్య, రోగ నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. 0-18 ఏళ్లలోపు వారికి నిర్దేశిత విభాగాల్లో పరీక్షలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీల్లో ఏడాదికి రెండుసార్లు, పాఠశాలలు, కళాశాలల్లో ఏడాదికి ఒకసారి బృందాలు వెళ్తున్నాయి.



చిన్నారులకు వైద్య పరీక్షలు

ఆసుపత్రులతో ఒప్పందం

మొబైల్ హెల్త్ టీం కిట్ వెంట తీసుకెళ్తున్నారు. 38 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరం మేర పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా, సర్వజన ఆసుపత్రులకు పంపిస్తున్నారు. తీవ్రత మేర కార్పొరేట్ ఆసుపత్రులతో వైద్య సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పుట్టుకతో వచ్చే లోపాలను సరి చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆకార్ ఆశా, కిమ్స్ ఆసుపత్రులతో ఒప్పందం చేసుకున్నారు. జిల్లాలో ఎక్కువగా రక్తహీనతతో బాలలు బాధపడుతున్నారని పరీక్షల ఫలితాల ద్వారా తేలింది. కావాల్సిన మాత్రలు పంపిణీ చేశారు.

806 మందికి కంటి లోపాలు

ఈ ఏడాది ఆగస్టు నుంచి కంటి స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆప్తాల్మిస్టుల సేవలు వినియోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు 16,711 మందిని పరీక్షలు జరిగాయి. 806 మంది లోపంతో బాధపడుతుండగా.. 90 మందికి వ్యాధులు ఉన్నట్లు నిర్ధారించారు.

2024 జూన్ - సెప్టెంబరులో పరీక్షలు

లక్ష్యం - 59,371 ● స్క్రీనింగ్ - 57940
బాధపడుతున్నట్లుగా గుర్తింపు - 11,118
తక్షణ వైద్యం - 9637 ● రెఫర్ - 1481
చికిత్సలు - 1416

రక్తహీనత, ఫలితాల తీరు

పరీక్షించిన బాలల సంఖ్య - 37,500
ఆరోగ్యం - 18,401 ● స్వల్ప రక్తహీనత - 5739
మధ్యస్థం - 11,709 ● తీవ్ర రక్తహీనత - 1651

గుర్తించిన ముఖ్య రుగ్మతలు

చర్మం- 359 ● దంతాలు - 390
దృష్టి - 613 ● కౌమారంలో - 167
గుండె - 12 ● చెవి, ముక్కు, గొంతు - 41
● ఎదుగుదల - 15

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

– డా.శ్రీకళ, జిల్లా కార్యక్రమ అధికారి, ఆర్‌బీకేఎస్

త్వరలోనే గుండె సంబంధిత శిబిరాన్ని నిర్వహిస్తాం. పరీక్షలు నిర్వహిస్తాం. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లలకు ఎక్కువగా ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు అందించాలి. సకాలంలో టీకాలు ఇప్పించాలి.

మదిమదిలో శరణు ఘోష



మహాపాదయాత్రగా వెళ్తున్న అయ్యప్పమాలధారులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: స్వామి శరణం.. అయ్యప్ప శరణం.. స్వామియే శరణం.. అయ్యప్ప పాదం.. అంటూ సిద్దిపేట పురవీధులన్నీ ఆదివారం అయ్యప్ప స్వామి శరణుఘోషతో మారుమోగాయి. మూడో మహాపాదయాత్రను సిద్దిపేట నుంచి భక్తులు ఆదివారం ప్రారంభించారు. 120 మంది మాలధారులు శబరికి బయలుదేరారు. అంతకుముందు ఉమాపార్వతీ కోటిలింగేశ్వరాలయంలో పూజలు చేశారు. గురుస్వాములు రాజు, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, యాదవరెడ్డి, దుర్గారెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సిద్దిపేట జిల్లావారితో పాటు రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాల నుంచి మాలధారులు పాల్గొన్నారు. నవంబరు 29న కేరళకు పాదయాత్ర చేరనుంది.

'స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి'



నీలం మధు, నర్సారెడ్డికి జ్ఞాపికలు అందిస్తున్న తున్కిఖల్సా పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ నిర్వాహకులు

వర్గల్, ములుగు, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు సత్తా చాటి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖల్సా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయన్నారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాం నర్సింలు, గ్రామ అధ్యక్షుడు జెల్ల మల్లేశం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ములుగు మండలం వంటిమామిడిలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నీలం మధును స్థానిక కాంగ్రెస్ నాయకులు గజమాలతో సత్కరించారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రవి, కాంగ్రెస్‌న నాయకులు ఉన్నారు.

వాలీబాల్ విజేత మెదక్ జట్టు



మెదక్ జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

మెదక్ టౌన్, రూరల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి బాలుర అండర్-17 వాలీబాల్ విజేతగా మెదక్ జట్టు నిలిచింది. పాఠశాల క్రీడ సమైఖ్య(ఎస్‌జీఎఫ్) మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం మంభోజిపల్లిలోని గీతా పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగం ఫైనల్‌లో మెదక్, సిద్దిపేట జట్లు పోటీపడగా మెదక్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయ స్థానంలో సంగారెడ్డి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో సంగారెడ్డి, ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయ స్థానంలో మెదక్ జట్లు నిలిచాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.... ఉత్తమ ప్రతిభ కనబర్చిన 24 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. గెలుపొందిన విజేతలకు గీతా పాఠశాల ప్రిన్సిపల్ సుగుణాకర్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి కిషోర్, పేట జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావుతో కలిసి ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ జ్ఞాపికలను ప్రధానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, వినోద్‌కుమార్, మనోహర్, శేఖర్, దేవేందర్ రెడ్డి, నరేష్, కుమార్ తదితరులు ఉన్నారు.

తూకానికి కాంటాలు సిద్ధం



రైతులు పండించిన వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. గజ్వేల్ మండల పరిధిలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే 17 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలను తూకాలు వేసేందుకు కాంటాలు సిద్ధం అయ్యాయి. గజ్వేల్‌మార్కెట్ యార్డులో భద్రపరిచారు. కేంద్రాలకు తరలిస్తారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

మల్లన్న చెంత.. అసౌకర్యాల చింత



కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో దప్పిక తీర్చుకోవడానికి ఏర్పాటు చేసిన నల్లాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏటా రూ.18 కోట్లకు పైగా ఆదాయం ఉన్నా భక్తుల మౌలిక సౌకర్యాన్ని పట్టించుకోవటం లేదు. క్యూలైన్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. తాగునీటి నల్లాలు, పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. కొబ్బరికాయ కొట్టే ప్రాంతం అపరిశుభ్రంగా ఉంది. ఈ విషయమై ఆలయ ఈవో ఆలూరు బాలాజీ మాట్లాడుతూ తక్షణమే సరి చేయిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, చేర్యాల:

5 తరగతులకు ఒకరే!



ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను తల్లిదండ్రులు పంపించడమే కష్టమవుతోంది. కాస్తో కూస్తో విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. జగదేవపూర్ మండలం ధర్మారం ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులకు చెందిన 15 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి అన్ని సబ్జెక్టులు బోధించడానికి ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయినులు ఉండగా బదిలీల్లో ఇతర బడులకు వెళ్లారు. ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం వచ్చిన కిష్టయ్య మాత్రమే బోధిస్తున్నారు. మరో ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జగదేవపూర్

ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలి: ఎమ్మెల్యే పల్లా



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణ

చేర్యాల, న్యూస్‌టుడే: కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని సేకరించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. చేర్యాల మండలం ముస్త్యాల, మద్దూరు మండలం వల్లంపట్ల, ధూళ్మిట్ట మండలం కూటిగల్, కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. భారాస పాలనలో రైతులకు పెట్టుబడి సాయం, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం వల్ల సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. తపాసుపల్లి జలాశయాన్ని గోదావరి జలాలతో నింపడం వల్ల చేర్యాల సబ్‌డివిజన్ సస్యశ్యామలమయ్యిందన్నారు. చేర్యాల, మద్దూరు పీఏసీఎస్ ఛైర్మన్లు మేరుగు కృష్ణ, తిరుపతి రెడ్డి, విపణి ఛైర్‌పర్సన్ శ్వేత, ఏపీఎంలు, నాయకులు పాల్గొన్నారు.

బస్టాపులో ప్రాణాలు కోల్పోయిన ఆటో డ్రైవర్

కడుపునొప్పితో వస్తే 'గాంధీ'కి రెఫర్ చేసిన గజ్వేల్ వైద్యులు



గజ్వేల్ గ్రామీణ: అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్ గజ్వేల్ బస్టాపులో కుప్పకూలి మృతి చెందాడు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. దౌల్తాబాద్ మండలం దొమ్మాటకు చెందిన పయ్యావుల యాదగిరి (35), భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్న యాదగిరి ఆదివారం ఉదయం ఎక్కువ బాధతో ఉండటంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యానికి గాంధీ ఆసుపత్రికి సిఫారసు చేశారు. బాధితుడు గాంధీ ఆసుపత్రికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో గజ్వేల్‌కు వచ్చి బస్సు కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో అతను ఒక్కసారిగా అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

సిద్దిపేట అర్బన్, హుస్నాబాద్: విద్యుత్తు తీగలను అనుకొని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సిద్దిపేట గ్రామీణం, నారాయణరావుపేట మండలాల్లోని చింతమడక, మాచాపూర్, సీతారాంపల్లి, అంకంపేట, నారాయణరావుపేట, బంజేరుపల్లి, ఇబ్రహీంపూర్, లక్ష్మీదేవిపల్లి, కోదండరావుపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. హుస్నాబాద్‌లో స్తంభాల పనులు నిర్వహిస్తున్నందున 21న సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అంబేడ్కర్ చౌరస్తా నుంచి పందిల్ల వాగు వరకు నిలిపివేయనున్నారు. మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఆరున్నర వరకు పోతారం వైపు సరఫరా నిలిపివేస్తారన్నారు. పోలీసు స్టేషన్, బీఎస్‌ఎన్‌ఎల్ టవర్, నెహ్రూ చౌరస్తా, గణేశ్‌నగర్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు సరఫరా ఉండదు.

రైతులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్



హుస్నాబాద్: రాస్తారోకోలో పాల్గొన్న సతీశ్‌కుమార్, నాయకులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం రైతు భరోసాను ఎగవేయడం రైతులను మోసం చేయడమేనని మాజీ శాసనసభ్యుడు వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద రైతు భరోసా తీరుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారాస రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు భరోసా ఖరీఫ్‌కు ఇవ్వడం లేదనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి ఇచ్చి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని.. నిరుద్యోగులపై లాఠీఛార్జీ చేయడాన్ని ఖండించారు. స్థానిక మంత్రి ప్రభాకర్ నియోజకవర్గంలో ఊకదంపుడు మాటలు, అమలుకాని హామీలు ఇచ్చి వెళ్తున్నారన్నారు. దాదాపు గంటసేపు రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత, ఉపాధ్యక్షురాలు ఐలేని అనిత, పుర, విపణి మాజీ ఛైర్మన్లు సుద్దాల చంద్రయ్య, తిరుపతిరెడ్డి, అశోక్‌బాబు, రజని, పట్టణ భారాస అధ్యక్షుడు అన్వర్‌పాషా, మాజీ ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

పది బిళ్ల.. చెల్లదంటే ఎలా?

చెలామణి పెంచేందుకు బ్యాంకు అధికారుల కృషి

న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్

ఒక రూపాయి, 2 రూపాయలు, 5 రూపాయల నాణేలను స్వీకరిస్తున్న ప్రజలు.. 10 రూపాయల బిళ్లను చెలామణి చేయడానికి సుముఖంగా ఉండటం లేదు. ఇది కొన్నేళ్లుగా జరుగుతోంది. ప్రజల్లో 'పది' బిళ్లపై ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించి నాణేల చెలామణి పెంచేందుకు బ్యాంకు అధికారులు విశేష కృషి చేస్తున్నారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా పది రూపాయల నాణేలను మార్కెట్‌లో విడుదల చేసినప్పటికీ చెలామణిలో లేకపోవడంతో చిల్లర కొరత ఏర్పడుతోంది. దుకాణదారులు, వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించి ఆ నాణెల స్వీకరణ స్థితి పెంచేందుకు వీలుగా యూబీఐ, ఎస్బీఐ అధికారులు గత వారం ప్రచారం ప్రారంభించారు.



సిద్దిపేట రైతు బజారులో నాణేలను అందజేస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు

దుకాణదారులు సిద్ధం

కిరాణా, పాన్, హోటళ్లు, చిరు వ్యాపారాలు, కూరగాయల మార్కెట్లలో, బస్సుల్లో నాణేల అవసరం ఎక్కువగా ఉంటుంది. వ్యాపారులు పది నాణెం ఇచ్చినా ప్రజలు తిరస్కరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చిరిగిపోయిన, నలిగిన కాగితం నోట్లు తీసుకుంటున్నారే తప్ప నాణెం తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఎక్కువ రకాల డిజైన్లలో నాణేలు ఉండటంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాటికి అధికారిక గుర్తింపు ఉందో లేదోననే సందేహాలు సామాన్యులకు కలుగుతున్నాయి. బ్యాంకు పరిధిలోని మార్కెట్లు, దుకాణాలు, రైతు బజారులో దుకాణాదారులను, వినియోగదారులను అధికారులు, సిబ్బంది కలిసి మాట్లాడుతున్నారు. నిర్వాహకుల నుంచి నాణేలను తీసుకొని ప్రజలకు మార్పిడి చేసిస్తున్నారు. బ్యాంకులో నగదు లావాదేవీల సందర్భంగా తప్పనిసరిగా కొంతమేర నాణేలు ఇవ్వనున్నారు.



ఇదీ సంగతి: ● రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 14 డిజైన్లలో రూ.10 నాణేలను విడుదల చేసింది.

● స్వామి చిన్మయానంద, నేషనల్ ఆర్కైవ్స్ ఇండియాతతదితర వ్యక్తులు, సంస్థల జ్ఞాపకార్థం సరికొత్త ఆకృతుల్లో నాణేలు ఉన్నాయి.

● చిల్లర ఇచ్చేటపుడు, తీసుకునేటపుడు రూ.10 నాణేన్ని వ్యక్తులైనా, సంస్థలైనా తిరస్కరిస్తే చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

● వ్యక్తులెవరైనా ముడత పడిన, లోపాలున్న నోట్లను తీసుకొస్తే ఉచితంగానే నాణేలతో మార్పిడి చేయాలని.. నమ్మకాన్ని పెంచడానికి, చెలామణి చేయడానికి బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలిచ్చింది.

● 2005, 2008, 2011, 2019 సంవత్సరాల్లో కొత్త డిజైన్లలో రూ.10 నాణేలను ఆర్‌బీఐ విడుదల చేసింది.

● సిద్దిపేట జిల్లాలో మేళా సందర్భంగా గత వారం రూ.లక్ష విలువైన 'పది' నాణేలను రైతుబజారులో.. అదే విలువవి దుద్దెడ టోల్‌గేట్ నిర్వాహకులకు బ్యాంకు ప్రతినిధులు అందించారు.

ఎవరూ తీసుకోవటం లేదు

– విఠల్, కిరాణా వ్యాపారి, సిద్దిపేట

కిరాణ దుకాణానికి వచ్చే వినియోగదారులు ఏ వస్తువైనా కొనుగోలు చేసి చిల్లరగా రూ.పది నాణెం ఇస్తే ఎవరూ తీసుకోవడం లేదు. బయట ఎవరూ తీసుకోవడం లేదని చెబుతున్నారు. నలిగిన నోట్లయినా తీసుకుంటున్నారు. చిల్లర కొరత ఎక్కువగా ఉంటోంది. అవగాహన పరిస్తే మార్పు ఉంటుంది.

అపోహలు తొలగిస్తాం

– హరిబాబు, లీడ్ బ్యాంకు మేనేజర్, సిద్దిపేట

అవగాహన లేక ప్రజలు తిరస్కరిస్తున్నారు. అపోహలో ఉన్నారు. అవగాహన కల్పిస్తున్నాం. 'పది' నాణేలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చేలా విస్తృత ప్రచారం చేపడుతాం.

మరమ్మతులు చేయరూ..


హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట పీహెచ్‌సీలో రిఫ్రిజిరేటర్లు చెడిపోయాయి. మరమ్మతు చేయించడం లేదు. కొత్తవి కొనుగోలు చేయడం లేదు. మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో మొత్తం రెండు రిఫ్రిజిరేటర్లు ఉన్నాయి. వీటిలో ఇమ్యునైజేషన్‌కు సంబంధించిన రిఫ్రిజిరేటర్ చాలా రోజులుగా పని చేయడం లేదు. దానికి సరితూగే విద్యుత్తు సరఫరా లేకపోవడమే కారణమని సిబ్బంది చెబుతున్నారు. వాక్సిన్‌ను హుస్నాబాద్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో భద్రపరుస్తున్నారు. నెలన్నర క్రితం మరో రిఫ్రిజిరేటర్ చెడిపోయింది. ఇన్సులిన్, టీటీ, పాము, కుక్కకాటు మందులు అందుబాటులో లేవు. రోగులను హుస్నాబాద్‌కు పంపిస్తున్నారు. అక్కడి సిబ్బంది రోగులను వాపసు పంపిస్తున్నారు. ఈ విషయమై వైద్యాధికారి రమ్యను సంప్రదించగా రిఫ్రిజిరేటర్లు చెడిపోయింది వాస్తవమేనన్నారు. మరమ్మతు కోసం మెకానిక్‌లను తీసుకురాగా పని చేయవని చెప్పారన్నారు. కొత్తవి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రోగులను హుస్నాబాద్‌లోని సీహెచ్‌సీకి పంపిస్తున్నామన్నారు.

శౌర్యానికి ప్రతీక సేవా దీపిక

నేడు ఫ్లాగ్ డే

న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్

ఎక్కడ ఘర్షణలు తలెత్తినా.. నాయకులు, ప్రజల మధ్య గొడవలు చోటుచేసుకున్నా ముందుగా ప్రత్యక్షమయ్యేది పోలీసే. రాత్రి, పగలు తేడా లేకుండా శాంతిస్థాపనే లక్ష్యంగా అలుపెరగక ముందుకు సాగుతున్న రక్షకులకు సెల్యూట్ చేయాల్సిందే. శాంతిభద్రతల రక్షణకు శ్రమించే ఎంతో మంది ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సమాజాన్నే కుటుంబంగా భావించే ఖాకీలు అంకితభావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. సాంకేతికత తోడుగా నేరాలను ఛేదిస్తున్నారు. సేవా స్ఫూర్తి చాటుతూనే ప్రజా చైతన్యం తెస్తున్నారు. నేడు పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా కథనం.



	సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
పోలీసు స్టేషన్లు	27	32	21	19
అధికారులు, సిబ్బంది	1227	796	788	1191
హోంగార్డులు	208	274	146	696
కళాబృందం	01	01	01	03

నాన్న బాటలో అడుగేసి..



మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై 1999 సెప్టెంబరు 13న రాత్రి మావోయిస్టులు జరిపిన దాడిలో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారిలో సంగారెడ్డికి చెందిన కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు. ఆయన రెండో కుమారుడు విద్యాసాగర్ నాన్న బాటలోనే నడవాలని నిర్ణయించుకున్నారు. ఈ శాఖలోనే చేరి ప్రస్తుతం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పని చేస్తున్నారు. **- పాపన్నపేట**

స్నేహపూర్వకంగా..

వివిధ సందర్భాల్లో మహిళలకు బాసటగా నిలవడంలో 'స్నేహిత' ముందంజలో నిలుస్తోంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు ఠాణా సమీపంలో గతేడాది జనవరి 5న ఈ మహిళా సహాయక కేంద్రం ప్రారంభమైంది. ఇప్పటి వరకు 1,261 ఫిర్యాదులు స్వీకరించగా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే మహిళల కేసులు.. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు ఠాణాకు, తదుపరి 'స్నేహిత'కు చేరవేస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో కొనసాగుతోంది. సీపీ డా. అనూరాధ సమీక్షిస్తూ.. దిశానిర్దేశం చేస్తున్నారు. స్వార్డ్ సంస్థ కార్యదర్శి శివకుమారి పర్యవేక్షిస్తున్నారు. వారంలో ఒకరోజు న్యాయవాది అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మూడు నుంచి ఐదుమార్లు కౌన్సెలింగ్ చేస్తున్నారు.



ఆనాటి ఘటనలు..

● హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: 1991లో హుస్నాబాద్ సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్ హుస్నాబాద్ మండలం రామవరంలో బస్సును పీపుల్స్‌వార్ దళ సభ్యులు బాంబుతో పేల్చివేయడంతో ప్రాణాలు కోల్పోయారు. దౌల్తాబాద్ ఎస్‌ఐ రాజగోపాలచారి, హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య.. దౌల్తాబాద్ శివారులో నక్సలైట్ల కాల్పుల్లో మరణించారు. ● 1997 నవంబరు 17న శివ్వంపేట మండలం పిల్లుట్లలో నక్సల్స్ ఓ ఇంటిని పేల్చారు. దాని పరిశీలనకు వెళ్లిన అప్పటి తూప్రాన్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, శ్రీనివాసరావు, సుజత్‌అలీ, లక్ష్మణ్‌నాయక్ మందుపాతర పేలుడులో చనిపోయారు. ● 2012 మార్చి 28న అర్ధరాత్రి వేళ కోహీర్‌లోని సిండికేట్ బ్యాంకులో అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు కలిసి బ్యాంకు దోపిడీ చేస్తున్నట్లు సైరన్ మోగింది. స్థానిక పోలీసులకు సమాచారం అందగా ఎస్‌ఐ నోముల వెంకటేశ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ వెళ్లారు. వారిని పట్టుకునే యత్నంలో దోపిడీ దొంగలు నాటు తుపాకులతో కాల్చగా ఎస్‌ఐకి తూటా తగిలింది. అయినా లెక్క చేయకుండా వారిని పట్టుకున్నారు.

సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాతో..



సైబర్ నేరాల అడ్డుకట్టపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ అందుబాటులోకి తెచ్చారు. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఐదుగురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.లక్షకు పైగా సైబర్ మోసం జరిగితే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. వివిధ స్థాయిల్లో దర్యాప్తును ఠాణాల వారీగా పోలీసులకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. సాంకేతికతతో ఛేదిస్తున్నారు. సామాజిక మాధ్యమాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

30 గంటల్లో ..

సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అమ్మమ్మ, నాయనమ్మ కళ్లుగప్పి పసికందును గుర్తుతెలియని మహిళలు అపహరించారు. పోలీసులు సాంకేతిక సాయంతో 30 గంటల్లో ఛేదించారు. మనూరు మండలం దూదిగొండకు చెందిన అబ్బాస్, నసీమా దంపతులు. నసీమా ఈ నెల 8న ప్రసవానికి ఆసుపత్రిలో చేరగా ఆడపిల్ల జన్మించింది. మరుసటి రోజు ఇద్దరు మహిళలు పాపను ఎత్తుకెళ్లారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పట్టణ సీఐ భాస్కర్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచనలతో సీసీ కెమెరాలను పరిశీలించారు. తనిఖీలు ముమ్మరం చేశారు. హైదరాబాద్‌లోని బోరబండలో నిందితులు ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నారు. పసికందును తల్లి ఒడికి చేర్చారు.




తల్లికి చిన్నారిని అప్పగించిన డీఎస్పీ, సీఐ

మూడు తరాల్లో..



ఇమామ్



జాని బాషా



నయీమ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా నకిరేకల్ మండలం గుండ్లపల్లికి చెందిన షేక్ ఇమామ్ సాహెబ్ కానిస్టేబుల్‌గా పని చేసి 1989లో పదవీ విరమణ పొందాడు. ఆయన స్ఫూర్తితో కొడుకు షేక్ జానిబాషా 1992లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. తూప్రాన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నారు. జానిబాషా కొడుకు షేక్ నయీమ్ పాషా హైదరాబాద్ కొండాపూర్‌లో కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్నారు. మూడు తరాల వారు పోలీసుల శాఖలోనే ఉండటం గమనార్హం. **- న్యూస్‌టుడే, తూప్రాన్**

గజపాద ఘట్టం.. వీక్షించిన భక్తజనం



ఫసల్‌వాదిలో గజరాజు ప్రదర్శన



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆదివారం గజపాద ఘట్ట మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా విద్యాపీఠం నుంచి మంజీరా తీరం వరకు ఊరేగింపు చేపట్టారు. నదిలో గజరాజుకు స్నానం చేయించారు. అనంతరం విద్యాపీఠంలో నిర్మిస్తున్న ఆలయం చుట్టూ గజపాద ఘట్ట మహోత్సవం నిర్వహించారు. గజరాజుతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరపగా.. స్థానిక భక్తులు పాల్గొన్నారు. ఆటపాటలు, కోలాటంతో అలరించారు. పీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి తదితరులున్నారు.

పత్తి రైతులకు తప్పనున్న నిరీక్షణ

న్యూస్‌టుడే, గజ్వేల్, సంగారెడ్డి అర్బన్, మెదక్, పరిగి

ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి సాగు తర్వాతి స్థానం పత్తిదే. వికారాబాద్ జిల్లాలో ఇది మూడో స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం పత్తి చేతికొచ్చే సమయం కావడంతో దీన్ని సాగు చేసిన రైతులు విక్రయించేందుకు మిల్లుల వద్ద పడే నిరీక్షిస్తుంటారు. దీనికి ఇక నుంచి తెరపడనుంది. ప్రస్తుతం పొలాల క్రయ, విక్రయాలకు అమలు చేస్తున్న స్లాట్ విధానాన్ని పత్తి విక్రయాల్లోనూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మల్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని త్వరలోనే అన్ని జిల్లాల్లో శ్రీకారం చుట్టనుండటం విశేషం.



గజ్వేల్ సీసీఐ కేంద్రంలో బారులు తీరి..

సీసీఐ కేంద్రాల్లో..

పొలాల నుంచి సేకరించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మేందుకు వెళ్లే రైతులు ఒక్కోసారి జిన్నింగ్ మిల్లుల గేట్ల వద్ద నిరీక్షిస్తుంటారు. పలు సందర్భాల్లో అక్కడే నిద్రించి తమ వంతు ఎప్పుడొస్తుందా అని రోజులకొద్దీ ఎదురు చూసే పరిస్థితి. దీంతో ఎంతోమంది ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోతుంటారు. పత్తి కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని రైతులు ధర్నాలు చేసిన ఘటనలెన్నో ఉన్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు కొత్త విధానం ఉపయోగపడనుంది.

54 స్పిన్నింగ్ మిల్లులు..

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 46 మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లాలో మిల్లులు లేవు. ఇక్కడి వారంతా సంగారెడ్డి, సిద్దిపేటకు వెళ్తుంటారు. వికారాబాద్ జిల్లాలో 8 మిల్లులు ఉన్నాయి.

ఎలా చేస్తారంటే..

పత్తి రైతులు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేదీ, సమయం సూచిస్తూ సమాచారాన్ని రైతుల చరవాణికి పంపిస్తారు. ఆరోజు నేరుగా కేటాయించిన మిల్లుకు దిగుబడిని తీసుకొచ్చి అమ్ముకోవచ్చు.

సిద్దిపేట ■ సంగారెడ్డి ■ మెదక్ ■ వికారాబాద్ ■

నాలుగు జిల్లాల్లో పత్తి సాగు (లక్షల ఎకరాల్లో)

సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
3.35	1.04	0.36	2.5

జిన్నింగ్ మిల్లులు

సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
24	22	00	08

మద్దతు ధర

పొడవు రకం: రూ.7521

మధ్య రకం: రూ.7121

క్రీస్తును స్మరించి.. భక్తితో ఆరాధించి



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్త బృందం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: క్రీస్తు నామస్మరణతో ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించారు. మెదక్ ప్రెసిబేటరి ఇన్‌ఛార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఆరాధనలు చేపట్టారు. ఆయనతో పాటు వనస్థలిపురం ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి జాన్ సుందర్ దైవసందేశాన్ని వినిపించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల, రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఏసయ్యను దర్శించుకుని తన్మయత్వం పొందారు. భక్త బృందం క్రీస్తును స్తుతిస్తూ పాడిన పాటలు అలరించాయి. గురువులు డేవిడ్ రిచర్డ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలో 1972-75 బీఎస్సీ ఎంపీసీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. 50 వసంతాల తర్వాత అంతా ఒకచోటుకు చేరి ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ మధురజ్ఞాపకాలు పంచుకున్నారు. వీరిలో ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రథమ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ నాగభూషణం, భాజపా రాష్ట్ర నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, వీహెచ్‌పీ తెలంగాణ పూర్వ ఆర్గనైజర్ గాల్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.అయోధ్యరెడ్డిని సన్మానించారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా చేగుంట మండలానికి చెందిన పాండ్యాల రాజుగౌడ్ తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు నిమిత్తం పద్మానగర్ ఫేజ్2కు వచ్చి నివసిస్తున్నాడు. ఇంటి యజమానురాలు సురేఖ ఇంటి గోడలు షాక్ కొడుతున్నాయని చెప్పడంతో రాజుగౌడ్ వచ్చి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ విద్యుత్తు అధికారులతో మాట్లాడి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును ఎమ్మెల్యే రాజు భార్య నవ్యకు ఆదివారం అందజేశారు.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్య



ప్రతాప్‌సింగ్



కళావతి

ఝరాసంగం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ హన్మంతు, ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ఝరాసంగానికి చెందిన బొందిల ప్రతాప్‌సింగ్(60), కళావతి(55) దంపతులు కొన్నేళ్లుగా కేతకి ఆలయ సమీపంలో అల్పాహారం, టీ స్టాల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నాళ్లుగా వ్యాపారంలో నష్టాలు రావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో తరచుగా భార్యభర్తల మధ్య గొడవలు కూడా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఇద్దరు అక్కడే పురుగుమందు తాగి పడిపోయారు. చుట్టుపక్కల పొలాల రైతులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరికి వివాహాలు అయ్యాయి. కుమారుడు తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటున్నాడు. ప్రతాప్ సింగ్ సోదరుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో స్నానానికి దిగి మృత్యువాత



గోపాల్

న్యాల్‌కల్, జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: స్నానానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం చాల్కీ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం... రంజోల్ గ్రామానికి చెందిన కమ్మరి గోపాల్(21) జహీరాబాద్, పస్తాపూర్, చాల్కీ ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వచ్చిన డబ్బులను నిత్యం మద్యం తాగడానికి ఖర్చు చేసేవాడు. రెండు మూడు రోజులుగా ఆయన పనికి వెళ్లడం లేదు. రెండు రోజుల కిందట చాల్కీలోని కొత్త కాలువకు స్నానానికి వెళ్లిన గోపాల్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. దీనికి ఎవరూ గుర్తించలేదు. ఆదివారం నీటిలో కనిపించిన మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. గోపాల్ మృతిపై అనుమానాలు లేవని, ప్రమాదవశాత్తు మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సెక్కుతుండగా... ఆభరణాల చోరీ

నారాయణఖేడ్: ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా బ్యాగు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు 6.30 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఆదివారం స్థానికంగా చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లికి చెందిన నిర్మల కొన్నేళ్లుగా కుటుంబీకులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో బంధువుల ఇంట్లో ఓ శుభకార్యం నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా ఖేడ్ రాజీవ్ కూడలిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు ఖేడ్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారిస్తున్నారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 120-00	డ్రెస్డ్ 206-00	
రిటైల్ 142-00	స్కిన్‌లెస్ 234-00	

పంట రక్షణ తీగ.. ప్రాణం తీసింది

తల్లి, అన్న కళ్లముందే తమ్ముడి దుర్మరణం



బాలరాజు

పరిగి, పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: ఇద్దరు కొడుకులు తల్లి కలిసి.. సీతాఫలాలు అమ్మారు. చీకటి పడగానే.. ముగ్గురూ ముచ్చట్లోపడి.. ఇంటి దారి పట్టారు. అంతలోనే.. ముందు నడుస్తున్న చిన్నకొడుకు కాలికి విద్యుత్తు తీగ తగిలింది. గిలగిలా కొట్టుకుంటున్న ఆ బిడ్డను రక్షించలేక.. తన తమ్ముడు తన కళ్లముందే.. మృత్యువుతో పోరాడుతున్నా.. ఏం చేయలేని నిస్సహాయతతో ఇద్దరూ విలవిల్లాడారు. పరిగి మండలం రంగంపల్లిలో ఈ విషాదకరఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రంగంపల్లి గ్రామానికి చెందిన ఎలిచెలి పార్వతమ్మకు ఇద్దరు కుమారులు రాములు, బాలరాజు (28) ఉన్నారు. వారంతా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో సీతాఫలాలు విక్రయిస్తున్నారు. అడవిలో సేకరించిన ఫలాల్ని బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న చింతల్‌చెరువులో అమ్మకాలు సాగిస్తున్నారు. శనివారం ముగ్గురూ కలిసి కాయలను అమ్మకాలు జరిపారు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన కౌలు రౌతు పిట్ల వెంకటయ్య పొలం దారిలో ఇంటికి వెళుతున్నారు. రైతు అడవి పందుల నుంచి రక్షణకు ఏర్పాటు చేసిన.. విద్యుత్తు తీగపై బాలరాజు కాలు పడింది. దీంతో కరెంటు సరఫరా జరిగి ఒక్కసారిగా కిందపడి కొట్టుకుంటున్నాడు. అతడిని కాపాడేందుకు తల్లి ప్రయత్నించగా.. రాములు వెంటనే తల్లిని వెనక్కి జరగాలని బిగ్గరగా అరిచాడు. అంతే.. ఆమె వెనక్కి జరగగా.. క్షణాల్లో బాలరాజు అచేతనంగా పడిపోయాడు. వారి కేకలు విన్న గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. విద్యుత్తు సరఫరా నిలిపివేసి పరిశీలించగా.. యువకుడు తుది శ్వాస విడిచాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం మలుపు తీసుకుంటుండగా ప్రమాదం.. మెకానిక్ మృతి



స్వామి

బెజ్జంకి, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారి కూడలిలో మలుపు తీసుకుంటున్న ద్విచక్ర వాహనదారుడిని కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి క్రాసింగ్‌లో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన బింగి స్వామి(42) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న గాగిల్లాపూర్‌లో పని నిమిత్తం తన వాహనంపై వెళ్లి తిరుగుపయనమయ్యాడు. పెట్రోల్ పోసుకునేందుకు గ్రామ శివారులో మలుపు తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ప్రైవేటు ఆస్పత్రికి స్వామిని తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బైకు అదుపుతప్పి రైతు..



నర్సింలు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో పోచమ్మ ఆలయం నిర్మాణం చేపడుతున్నారు. గ్రామానికి చెందిన రైతు గొల్లపల్లి చిన్న నర్సింలు (58) మరికొందరు గ్రామస్థులతో కలిసి తుజాల్‌పూర్‌లోని ఆలయ నమూనాను పరిశీలించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత నిజామాబాద్ జట్టు



నిజామాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐలు కంప రవీందర్, రాఘవేందర్ తదితరులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్‌బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మాథ్యూ పాల్గొన్నారు.

వృద్ధులకు ఆరోగ్య భరోసా

ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్

వృద్ధాప్యంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ వయసులో ఉన్న వారిని పసి పిల్లలుగా కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. కొంత మందికి కుమారులు ఉన్నా వేదనే మిగులుతోంది. రోగాలబారిన పడ్డా ఎవరూ పట్టించుకోరు. ఇలాంటి కష్టకాలంలో ఉన్న వయోవృద్ధులకు మేమున్నాం అంటూ భరోసా కల్పించేలా ఉచిత వైద్య సేవలు అందించాలని కేంద్రం సంకల్పించింది. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈ ప్రక్రియ అమలు చేయనుంది. ఇందుకు వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు.



సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు

1835 రకాలుగా..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అన్ని వయసుల వారికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్న విషయం విదితమే. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందిస్తున్నారు. ఈ పథకం కింద 1835 రకాల రోగాలు ఉన్న వారికి దీన్ని వర్తింపజేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలుచేస్తోంది. దీని కింద వయోవృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించాలని నిర్ణయం తీసుకోవడంతో నాలుగు జిల్లాల వారికి మేలు చేకూరనుంది.

జిల్లాల్లో వయోవృద్ధులు

జిల్లా	వయోవృద్ధులు
సంగారెడ్డి	61,991
సిద్దిపేట	40,360
మెదక్	32,130
వికారాబాద్	39,153

దరఖాస్తు ఇలా..

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏజీపీఎంజేఏవై) వైబ్‌సైట్ https://ayushmanup.in ను సందర్శించాలి. అందులో ఆయుష్మాన్ భారత్(ఏఎంఐ) ఎలిజిబుల్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. చరవాణి నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దానితో ధ్రువీకరించుకోవాలి. గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం వివరాలు, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. ఇలా ఈ-కేవైసీ పూర్తవగానే ఆమోదం కోసం వేచి ఉండాలి. ఈ ప్రక్రియ పూర్తయితే కార్డు తెరపై కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యాప్‌లో నమోదుకు..:



కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ప్రత్యేకంగా కార్డులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో కార్డులు పొందవచ్చు.

నరేష్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జిల్లా సమన్వయకర్త, సంగారెడ్డి

ప్రయోజనాలిలా..

రూ.5 లక్షల వైద్య సాయం పొందే వీలుంది. మూడు రోజుల పాటు ఉచితంగా ఆసుపత్రిలో చేర్చుకోవడం, వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్‌కేర్ తదితర సేవలు పొందవచ్చు. దవాఖానాలో చేరాక 15 రోజుల వరకు సంరక్షణ ఉచితంగా లభిస్తుంది. మందులు, వసతి, పోషకాహారం అందజేస్తారు.

భాషల పరిరక్షణ తప్పనిసరి: వీసీ



అవార్డు గ్రహీతలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్ రావు ఉద్బోధించారు. లేకుంటే భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలకు అవార్డులు, పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ అధ్యక్షులు వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షులు సత్యమూర్తి, కార్యదర్శి చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎలిజబెత్ జయకుమారి, ఒడియా కవయిత్రి సుశ్రీసంగీత మిశ్ర, ఆంగ్ల కవి లక్ష్మణరావు, హిందీ రచయిత రామలింగేశ్వరరావు, నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్ కె.సరోజినీదేవి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని నిరసన



అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న స్థానికులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేట పరిధి రంగధాంపల్లి రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఆదివారం రహదారి నిర్మాణ పనులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణంతో ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. రంగధాంపల్లి రాజీవ్ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించి న్యాయం చేయాలన్నారు. నాయకులు వంగ నాగిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట అర్బన్: సిద్దిపేట జిల్లా అతిథి అధ్యాపకుల కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడిగా రాగుల నర్సింలు ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

దారిలో మలుపు.. ప్రమాదానికి పిలుపు



అలిరాజపేట, తీగుల్ దారిలో..



దుబ్బాక నుంచి చీకోడ్‌కు వెళ్లే మార్గంలో..

న్యూస్‌టుడే, జగదేవపూర్, దుబ్బాక: రహదారులు బాగున్నా రోజు ఎక్కడో ఒక చోట ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. కొన్నిచోట్ల మలుపుల వద్ద వేగని యంత్రికలు, సూచిక బోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఒక దానికొకటి ఢీకొంటున్నాయి. ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా.. అనేక మంది గాయాలపాలవుతున్నారు. మలుపుదారుల్లో తరచూ ఎక్కడో ఒకచోట వాహనాలు అదుపుతప్పి బోల్తాపడుతున్నాయి. జగదేవపూర్, దుబ్బాక మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వంపు దారులతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

కానరాని సూచిక బోర్డులు

- జగదేవపూర్ మండలపరిధి బీజీ వెంకటాపూర్ నుంచి తీగుల్ వెళ్లే దారిలో 4 కి.మీ. మార్గంలో మూడు మలుపులు ఉన్నాయి. ఈ రోడ్డుపై రాత్రివేళ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- తీగుల్ నుంచి అలిరాజపేట వెళ్లే దారిలోనూ మలుపుల వద్ద పొదలు పెరగడంతో రహదారి కనిపించడం లేదు.
- దుబ్బాక నుంచి లచ్చపేట మీదుగా చౌదరిపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో క్రాసింగ్ వద్ద, దుబ్బాక నుంచి చీకోడ్ వెళ్లే దారిలో క్రీడా ప్రాంగణం సమీపంలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి సూచికలు, వేగనియంత్రికలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053, జగదేవపూర్ 8008573209, హుస్నాబాద్ 8008573520, దుబ్బాక 9030037175, చేర్యాల 8008574871, గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, ములుగు: ? ములుగు మండలం తునికిబొల్లారంలో విద్యార్థుల సౌకర్యం కోసం నిర్మించిన నమూనా పాఠశాల భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. వెంటనే పూర్తి చేయించాలి.
– చంద్రశేఖర్ రెడ్డి, తునికి బొల్లారం

✓ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. గుత్తేదారుతో మాట్లాడి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.
– వెంకట శ్రీరామచంద్ర శర్మ, ఎంపీడీవో, ములుగు

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ? గత నెలలో కురిసిన భారీ వర్షాలకు నాగారం, మహ్మదాపూర్ గ్రామాల్లో కల్వర్టులు కోతకు గురయ్యాయి. వెంటనే మరమ్మతు చేయించాలి – ఎల్లేశ్, నాగారం

✓ ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే మరమ్మతు చేయిస్తాం – సాజిద్, ఆర్‌అండ్‌బీ ఏఈ

? అక్కన్నపేట మండలం పెద్దతండాలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇళ్లలోకి చొరబడి సామగ్రి ఎత్తుకెళ్తున్నాయి. వానరాల బెడదను నివారించాలి – గుగులోతు రాంబాబు

✓ గ్రామ సభలో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం
– రజని, పంచాయతీ కార్యదర్శి

అసంపూర్తిగా వైకుంఠధామం



బర్నింగ్ బెడ్‌లో పెరిగిన గడ్డి, ముళ్ల పొదలు

దుబ్బాక, న్యూస్‌టుడే: పల్లెల్లో వైకుంఠధామాలు, డంపుయార్డులు, మురుగుకాల్వలు, బహిరంగ వ్యాయామశాలలు, ప్రకృతివనాలు, నర్సరీల నిర్మాణానికి గతంలో అనేక చర్యలు తీసుకుంది. అవసరమైన నిధులు మంజూరు చేసినా నిర్వహణ కొరవడడంతో పలుచోట్ల అసంపూర్తిగా దర్శనమిస్తూ ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. వైకుంఠధామాల్లో వసతులు లేక అంత్యక్రియల వేళ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కథనం..

రూ.30 లక్షలతో నిర్మాణం

దుబ్బాక పురపాలికలోని లచ్చపేట 11వ వార్డులో పెద్దచీకోడ్‌కు వెళ్లే దారిలో రెండేళ్ల క్రితం పట్టణ ప్రగతి నిధులు రూ.10 లక్షలు, టీయూఎఫ్ఐడీసీ రూ.20 లక్షలు మొత్తంగా రూ.30 లక్షలతో వైకుంఠధామం నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో కేవలం రూ.10 లక్షలతో వైకుంఠధామంలో ఒక బర్నింగ్ పాయింట్, 70 శాతం ప్రహరీ మాత్రమే నిర్మించారు. చేసిన పనులకు బిల్లులు రాక గుత్తేదారు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. ప్రస్తుతం వైకుంఠధామం పూర్తిగా గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో లచ్చపేట వార్డు ప్రజలు మృతిచెందిన వారి అంత్యక్రియల వేళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజుల కిందట లచ్చపేటలో ఓ వ్యక్తి అంత్యక్రియలను సందరికుంటలో రాత్రిపూట టార్చిలైట్ల వెలుగులో నిర్వహించారు. అసంపూర్తి పనులను పూర్తిచేయాలని కౌన్సిలర్ నందాల శ్రీజ విజ్ఞప్తి చేస్తున్నారు.

నోటీసులు ఇస్తాం: - రమేశ్‌కుమార్, పుర కమిషనర్, దుబ్బాక

వైకుంఠధామం పనులు ఆపేసిన గుత్తేదారుకు త్వరలోనే నోటీసులు అందజేస్తాం. మరో గుత్తేదారుతో పనులు పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకొస్తాం.

సాహిత్యంతో ఉత్తమ సమాజ నిర్మాణం



పుస్తకావిష్కరణలో పాల్గొన్న పెద్దపల్లి అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్‌లాల్, కేడం లింగమూర్తి, తదితరులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: పుస్తకాలు చదవడం, రాయడం గొప్ప ఆలోచన విధానానికి పునాది అని పెద్దపల్లి జిల్లా అదనపు పాలనాధికారి జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో స్థానిక స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అన్నవరం దేవేందర్ రచించిన ‘అంతరంగం’ పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాబీల మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు పాలనాధికారి మాట్లాడుతూ.. ఉత్తమ సమాజ నిర్మాణానికి సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. పుస్తక రచయిత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ.. తాను ఇప్పటి వరకు 20 పుస్తకాలు రాశానన్నారు. ఈ పుస్తకాన్ని ‘ప్రతిపక్షం’ పత్రిక సంపాదకుడు మహ్మద్ ఫజుల్ రహమాన్‌కు అంకితం ఇస్తున్నానన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, దక్షిణ భారత సమాఖ్య ఫిల్మ్ సొసైటీ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ పొన్నం రవిచంద్రను సన్మానించారు. పురాధ్యక్షురాలు రజిత, ఉపాధ్యక్షురాలు అనిత, సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎంఈవో మనీలా, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి నిదర్శనం ‘అలయ్-బలయ్’



కార్యక్రమంలో దూది శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: దసరా పండుగ తర్వాత అలయ్-బలయ్ నిర్వహించుకోవడం తెలంగాణ సంస్కృతికి నిదర్శనం అని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని కొండా భూదేవి గార్డెన్‌లో అలయ్-బలయ్ కార్యక్రమం నిర్వహించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమానికి సిద్దిపేట ప్రాంతానికి చెందిన పలువురు రాజకీయ, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు హాజరు కాగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అలయ్-బలాయ్ చెప్పుకున్నారు. అనంతరం వివిధ రకాల వంటకాలతో భోజనాలు స్వీకరించారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆందోళన



రహదారిని పరిశీలిస్తున్న భారాస నాయకులు

చిన్నకోడూరు: భారాస ప్రభుత్వ హయంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని భారాస మండలశాఖ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నకోడూరులో అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి పనులను పరిశీలించి మాట్లాడారు.. చిన్నకోడూరు నుంచి కిష్టాపూర్ వరకు రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించడానికి గతంలో ఇచ్చిన రూ.88 కోట్ల నిధులను తిరిగి కేటాయించాలని డిమాండ్ చేశారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి

గజ్వేల్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, బోధనా రుసుములను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండు చేస్తూ మంగళవారం నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం గజ్వేల్ బాధ్యుడు నర్సింలు ఆదివారం గజ్వేల్‌లో కోరారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసే వరకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని నిర్వహిస్తామన్నారు.

నేడు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లోని గిరిజన బాలికల వసతి గృహాన్ని సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ సందర్శించనున్నట్లు ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భాజపా నాయకుడు గుగులోతు తిరుపతి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని బాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారన్నారు.

బహుజన ఉద్యమం బలోపేతమే ధ్యేయం

బెజ్జంకి, న్యూస్‌టుడే: బహుజన ఉద్యమం బలోపేతమే ధ్యేయంగా సభ్యత్వ నమోదు చేపడుతున్నామని బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నిశాని రామచంద్రం అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆదివారం బెజ్జంకిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించి మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో భాజపా, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజమల్లు, మండలాధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

భారాస నాయకులపై ఫిర్యాదు

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు దిష్టిబొమ్మ దహనం చేసిన భారాస నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం చిన్నకోడూరు ఠాణాలో ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. నాయకులు మహేందర్, పరశురాములు, జయంత్, తదితరులున్నారు.

కోతకు గురై.. మరమ్మతులు కరవై..



జగదేవపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి అంచులు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురయ్యాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు రోడ్డు దిగాల్సి వస్తుంది. రాత్రి వేళల్లో సమస్య తీవ్రంగా ఉంటోంది. ఎల్లమ్మగుడి పరిసరాల్లో రహదారి ఇరుపక్కలు కోతకు గురయ్యాయి. మట్టిపోసి మరమ్మతు చేసేవారు కరవయ్యారు. హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోనూ రోడ్డు పరిస్థితి ఇంతే. రెండు పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాం ఉండటం వల్ల వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డిని వివరణ కోరగా అధికారులకు నివేదించి ప్రమాదాలు నివారిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, జగదేవపూర్:

‘దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకే వర్గీకరణ’



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు

చేర్యాల, న్యూస్‌టుడే: కలిసిమెలిసి ఉంటున్న దళితులను విడగొట్టడానికి చేస్తున్న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరముందని జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 25 నుంచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టనున్న వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర గోడపత్రికలను ఆదివారం ఆయన చేర్యాలలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దళితుల ఐక్యత కోసం నిర్వహిస్తున్న ఈ పాదయాత్రకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి మాలలు వేలాదిగా తరలిరావాలని కోరారు. సంఘం పట్టణాధ్యక్షుడు పుట్ట రాజు, నాయకులు మల్లికార్జున్, కల్లూటి పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అర్బన్: ఎస్సీ వర్గీకరణ పేరిట నోటిఫికేషన్లు నిలుపుదల చేసి నిరుద్యోగులకు అన్యాయం చేయొద్దని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్ చెన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టరాదని కోరుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం సిద్దిపేటకు చేరుకుంది. ఎల్లేశ్, రవి, తదితరులు ఉన్నారు.

పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో నూతన ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. ఇటీవల నియమితులైన నూతన ఉపాధ్యాయులకు సంఘం ఆధ్వర్యంలో సర్వీసు రూల్స్, లీవ్ రూల్స్‌పై సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని సూచించారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఆన్‌లైన్లో ప్రారంభించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్‌వలీ అహ్మద్, కార్యదర్శి యాదగిరి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

సిద్దిపేట అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం రాజీలేని పోరాటాలు చేస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాలస్వామి తెలిపారు. సిద్దిపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి పేదల కడుపు కొడుతోందన్నారు.

అదృశ్యమై.. రోడ్డు పక్కన మృతదేహమై..

బెజ్జంకి: వారం రోజుల క్రితం అదృశ్యమైన మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి రోడ్డు పక్కన మృతదేహమై ఆదివారం కనిపించాడు. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట నసీర్‌నగర్‌కు చెందిన షాబుద్దీన్(50)కు మతిస్థిమితం సరిగా లేదు. కొన్నిసార్లు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయి కొన్నిరోజులకు తిరిగి వచ్చేవాడు. ఈ నెల 14న బయటికి వెళ్లిన షాబుద్దీన్ ఇంటికి వెళ్లలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదైంది. దేవక్కపల్లి రాజీవ్ రహదారి పక్కన ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. షాబుద్దీన్‌గా గుర్తించారు. మృతదేహానికి పరీక్ష అనంతరం కారణాలు తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోండి

సిద్దిపేట: ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రైవేటు టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు నవీద్, పాషా డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులతో విధులు నిర్వర్తింపజేస్తున్నారనే సమాచారంతో పాఠశాలకు చేరుకొని ప్రశ్నించారు.

భగీరథ.. నిత్యం వృథా!



రామంచ శివారులో ట్యాంకు నుంచి పోతున్న నీరు

పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో పల్లెల్లో విలువైన తాగు నీరు వృథా అవుతోంది. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం వందల లీటర్ల నీరు నేలపాలవుతోంది. సరఫరాపై పర్యవేక్షణ కొరవడడంతో మంచినీరంతా మురుగు కాలువల్లో ప్రవహిస్తోంది. గ్రామాల్లోని జలభాండాగారాలు నిండి గంటల తరబడి వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేరంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఎంపీవో సోమిరెడ్డి వివరణ కోరగా.. సిబ్బందికి సూచించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, చిన్నకోడూరు:

‘భారాస అసమర్థతను కాంగ్రెస్‌కు ఆపాదించడం సరికాదు’

గజ్వేల్, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వం చేసిన అసమర్థ పాలనను కాంగ్రెస్‌కు ఆపాదించడం సరికాదని గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం గజ్వేల్‌లో మాట్లాడుతూ.. గజ్వేల్‌లో అసంపూర్తిగా ఉన్న ఎంసీహెచ్‌ను ప్రారంభించి, సౌకర్యాలు కల్పించటం లేదని సీఎం రేవంత్‌రెడ్డిని నిందించడం అన్యాయమన్నారు. ఎన్నికల వేళ హడావుడిగా ఎంసీహెచ్‌ను అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారన్నారు. రింగురోడ్డు పూర్తికాక ముందే ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి చూసి జీర్ణించుకోలేక విమర్శిస్తున్నారన్నారు. ప్రతాప్‌రెడ్డి ఏ హోదాలో ఆస్పత్రికి వెళ్లారో చెప్పాలన్నారు. మజీద్ కమిటీ ఛైర్మన్ మతిన్, నాయకులు తదితరులు ఉన్నారు.

కొండపోచమ్మను దర్శించి.. మొక్కులు తీర్చుకుని



అలంకరణలో అమ్మవారు

జగదేవపూర్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు సందడి చేశారు. విద్యాసంస్థలు, కార్యాలయాలకు సెలవుదినం కావడంతో హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఒడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సిద్దిపేట భారాస నాయకుడు కడవేర్గు రాజనర్సు, తదితరులు పాల్గొని పూజలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రవీందర్‌సింగ్‌కు మద్దతు

సిద్దిపేట అర్బన్: ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌సింగ్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సాంస్కృతిక ఉపన్యాసక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మృత్యుంజయశర్మ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కరీంనగర్ నగర మేయర్‌గా ప్రజలకు సేవలందించిన వ్యక్తి రవీందర్‌సింగ్ అని పేర్కొన్నారు. సంస్కృత భాష పరిరక్షణకు కృషి చేశారని రవీందర్‌సింగ్‌ను కొనియాడారు. సాంస్కృతిక ఉపన్యాసక సంఘం నాలుగు వేల మంది మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంపత్, సురేశ్, తిరుపతి, గణేశ్, సుశీల్, రాజేశ్, నాగరాజు, భాస్కర్, నరసింహచారి తదితరులు ఉన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్లు ఇవ్వండి

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్లు కేటాయించాలని రెడ్డి ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు అప్పన్న రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హుస్నాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రెడ్డి సామాజిక వర్గంలో అనేక మంది నిరుపేదలు ఉన్నారన్నారు.

నీలకంఠ సమాజాభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న లోక లక్ష్మీరాజం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని నీలకంఠ దేవాలయంలో అఖిల భారత నీలకంఠ సమాజం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజం నూతన అధ్యక్షుడిగా లోక లక్ష్మీరాజం, కార్యదర్శిగా గవ్వల శంకర్, కోశాధికారిగా కడవేర్గు శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మీరాజం మాట్లాడారు. నీలకంఠ దేవాలయ అభివృద్ధికి, నీలకంఠ సమాజ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. ఈ మేరకు బల్దియా మాజీ అధ్యక్షుడు కడవేర్గు రాజనర్సు నూతన కార్యవర్గాన్ని అభినందించి సత్కరించారు. అనంతరం నూతన కార్యవరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు కడవేర్గు నర్సింలు, యోగేశ్వర్, సురేశ్, కడవేర్గు రాజు, జనార్ధన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం: భారాస



ములుగులో రాజీవ్ రహదారిపై నిరసన తెలుపుతున్న డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, జుబేర్‌పాషా, భారాస శ్రేణులు



కొండపాక గ్రామీణం: వెలికట్ట క్రాస్‌రోడ్డులో రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన



తొగుటలో ఆందోళన చేస్తున్న భారాస నాయకులు, రైతులు

న్యూస్‌టుడే జిల్లా బృందం: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ ఆదివారం భారాస నాయకులు జిల్లా వ్యాప్తంగా రహదారులపై ధర్నా, రాస్తా రోకోలు నిర్వహించారు. రాష్ట్ర సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలు తీశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.15000 చొప్పున రైతుభరోసా నిధులను వెంటనే అన్నదాతల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతుభరోసా వానాకాలం పంటకు అమలు చేయడం లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అనేక చోట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనేక ప్రాంతాల్లో పోలీసులు భారాస నాయకుల నిరసనను అడ్డుకొని రవాణాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో భారాస ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



చేర్యాల: కొమురవెల్లిలో నినాదాలు చేస్తూ..



మిరుదొడ్డిలో జాతీయ రహదారిపై రాస్తారోకో..

మురుగు కాలువలో పడి ఒకరికి గాయాలు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు అదుపుతప్పి మురుగు కాలువలో పడ్డాడు. చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన మొండయ్య ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై నాగారం రోడ్డులో వెళ్తున్నాడు. వాహనం అదుపుతప్పడంతో ఆ మార్గంలోని సినిమా థియేటర్ పక్కనున్న మురుగుకాలువలో బండితో సహా పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: జూద స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించి నిందితులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బయ్యారం శివారులోని ఓ మేకల షెడ్డులో కొంత మంది జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో జూదమాడుతున్న ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.34వేల నగదు, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 6 చరవాణులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని కుషాల్‌నగర్‌లో గుర్తుతెలియని దుండగులు తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సీఐ ఉపేందర్, స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన బూర్గు లింగంగౌడ్ జీవనోపాధి కోసం మహారాష్ట్రకు వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య వసంత తన కుమార్తెతో కలిసి కుషాల్‌నగర్‌లోని ఎల్ఐసీ కాలనీలో నివసిస్తున్నారు. గత శుక్రవారం వసంత తన కుమార్తెతో కలిసి తన తల్లిగారి ఊరైన అంతగిరి వెళ్లారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం వీరి ఇంటి పైఅంతస్తులో అద్దెకుండే వాళ్లు వీరి ఇంటి తాళం తీసి ఉందని గమనించి వెంటనే వసంతకు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండి, బీరువాలోని సామగ్రి అంతా చిందరవందరగా పడి ఉంది. మూడున్నర తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.7 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వసంత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు. కాగా ఇదే భవనంలో కింది అంతస్తులో అద్దెకుండే వారి ఇంట్లో సైతం దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు.

దాబాలు, బెల్టు షాపులపై కేసు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పట్టణంలో దాబాలు, బెల్టు షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. మద్యం సిట్టింగులు నిర్వహిస్తున్న రెండు దాబాలు, బెల్టుషాపు నిర్వహిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు.